క్లుప్తంగా

ఆన్‌లైన్ క్విజ్ పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

కడ్తాల్: జూన్ 18న నిర్వహించనున్న రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల వాల్‌పోస్టర్‌ను మంగళవారం మండల కేంద్రంలో నియోజకవర్గ ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ఆవిష్కరించారు. ఈ పోటీలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాయకులు కోరారు. పోటీల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు షాబుద్దీన్, ఫరీద్, రమేశ్, నాయకులు రాజేశ్, ఇమ్రాన్‌బాబా, శ్రీకాంత్, పవన్, దర్శన్, లడ్డు తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాలను సహించేది లేదు

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి



అనుమతులు లేని నిర్మాణాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

తుర్కయంజాల్: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి అన్నారు. తుర్కయంజాల్ రెవెన్యూ సర్వే నంబర్ 78లో అక్రమంగా చేపడుతున్న రెండు నిర్మాణాలను మంగళవారం రెవెన్యూ అధికారుల సమక్షంలో జేసీబీ సహాయంతో కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ.. తహసీల్దార్ అనితారెడ్డి ఆదేశాల మేరకు కూల్చివేతలు చేపట్టామని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలను సహించేది లేదన్నారు. వీఆర్ఏ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మండలి చైర్మన్ గుత్తా పరామర్శ



పద్మమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గుత్తా, కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తల్లి పద్మమ్మ(92) ఇటీవల మరణించారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామానికి విచ్చేసిన మండలి చైర్మన్ గుత్తా.. పద్మమ్మ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు వెంకటప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



విరాళం అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

తలకొండపల్లి: శిథిలావస్థలో ఉన్న ఆలయాల పునరుద్ధరణతో పాటు నూతన ఆలయాల నిర్మాణానికి కృషిచేస్తామని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆర్లకుంటతండాలోని రేణుక ఎల్లమ్మ, తాటికొండ మైసమ్మ నూతన ఆలయాల నిర్మాణానికి మంగళవారం .. ఫౌండేషన్ నుంచి రూ.1,50,000 విరాళంగా నిర్వాహకులు రాములు నాయక్‌కు అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు రాఘవేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తిరుపతి మేయర్‌ను కలిసిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



ఆమనగల్లు: ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తన మనవరాళ్లతో కలిసి మంగళవారం తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుపతి మేయర్ డా.శిరీష యాదవ్ ఆహ్వానం మేరకు మంగళవారం ఉదయం మేయర్ నివాసంలో అల్పాహార విందుకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను మేయర్ దంపతులు ఘనంగా సత్కరించారు.

కళాశాల ఏర్పాటయ్యేనా?

- కడ్తాల్‌లో ప్రభుత్వ ఇంటర్ కళాశాల లేక విద్యార్థుల అవస్థలు
- హామీలకే పరిమితమైన ప్రజాప్రతినిధులు
- నిరాహార దీక్షకు దిగుతామంటున్న విద్యార్థి సంఘాల నేతలు



కడ్తాల్ మండల కేంద్రం వ్యూ

కడ్తాల్: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. దీంతొ ఈ ప్రాంత నిరుపేద విద్యార్థులకు ఇంటర్ విద్య నేటికీ అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. నూతనంగా ఏర్పడిన కడ్తాల్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అందుబాటులో లేకపోవడంతో ఈప్రాంత నిరుపేద విద్యార్థులు పదోతరగతితోనే చదువు మానేస్తున్నారు. స్థానికంగా ప్రైవేట్ కళాశాలలు ఉన్నా వేలకు వేలు ఫీజులు కట్టలేక చాలామంది నిరుపేద విద్యార్థులు ఇంటర్ విద్య చదవలేని పరిస్థితి ఉంది. సమీప మండలమైన ఆమనగల్లులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉన్నప్పటికీ అక్కడికి వెళ్లాలంటే 20 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుండటంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. వివిధ సందర్భాల్లో ఇక్కడికి వచ్చిన ప్రజాప్రతినిధులు జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీలు ఇవ్వడమే తప్ప వాటిని నెరవేర్చడంలేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మండల పరిధిలో ఉన్నత పాఠశాలలు..

కడ్తాల్ మండల కేంద్రంలోని రెండు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు, కస్తూర్బాగాంధీ, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సుమారు ప్రతి ఏటా 300 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుంటారు. దీంతో పాటు మరో 4 ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో 200మంది వరకు విద్యార్థులు ప్రతియేటా ఎస్సెస్సీ పరీక్షలకు హాజరవుతారు. అదే విధంగా రావిచేడ్, ఏక్వాయిపల్లి, ముద్వీన్, చరికొండ గ్రామాల్లో కూడా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మండల కేంద్రంతో పాటు పరిధిలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో ప్రతి సంవత్సరం సుమారు 500 నుంచి 600 మంది వరకు విద్యార్థులు 10వ తరగతి విద్యను అభ్యసిస్తున్నారు. వీరేకాక మైసిగండి, గోవిందాయిపల్లి, కర్కల్‌పహాడ్, పడకల్, మక్తమాధారం, సాలార్‌పూర్, దసర్లపల్లి, ముచ్చర్ల, శాయిరెడ్డిగూడెం తదితర గ్రామాల నుంచి పదోతరగతి చదువుకునేందుకు వస్తారు.

ప్రభుత్వ కళాశాల లేకపోవడంతో..

మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో ఎటా వందలాది మంది విద్యార్థులు ఇంటర్ విద్యకు దూరమవుతున్నారు. ఆర్థికంగా ఉన్నవాళ్లు సమీప పట్టణాలు, కడ్తాల్‌లోని ప్రైవేట్ కళాశాలలతో పాటు, కందుకూర్, తుక్కుగూడ, కల్వకుర్తి, ఆమనగల్లు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారు. మండల కేంద్రంలో కళాశాల ఏర్పాటైతే పట్టణ విద్యార్థులతో పాటు, సమీప గ్రామాల విద్యార్థులకు ఏంతో సౌలభ్యంగా ఉంటుంది. 2023–24 విద్యా సంవత్సరంలోనైన మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిరాహార దీక్షలు చేపడతాం



అన్ని సౌకర్యాలున్న కడ్తాల్ మండల కేంద్రంలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయాలంటూ గతంలో అనేక ఆందోళనలు చేపట్టాం. అయినా ప్రభుత్వంలో చలనం లేదు. త్వరలో ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఐక్య ఉద్యమ కార్యచరణ రూపొందిస్తాం. ఆమరణ నిరాహార దీక్షలు చేపడతాం. కళాశాల ఏర్పాటు విషయమై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తాం.

– షాబుద్దీన్, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు, కడ్తాల్

విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు



నూతనంగా ఏర్పడిన కడ్తాల్ మండల కేంద్రంలో ప్రభుత్వ ఇంటర్ కళాశాల లేకపోవడంతో ఈ ప్రాంత నిరుపేద విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పదోతరగతితోనే చదవుకు స్వస్తి చెబుతున్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రంలో వెంటనే కళాశాల ఏర్పాటు చేయాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ, కడ్తాల్

మంత్రి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తే మండల పరిధిలోని 24 గ్రామాల విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. కళాశాల ఏర్పాటు గురించి స్థానిక ఎమ్మెల్యేతో పాటు మంత్రి సబితారెడ్డి, ఉన్నతాధికారులకు విన్నవించాం. అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపించారు.

– దశరథ్‌నాయక్, జెడ్పీటీసీ, కడ్తాల్

ఇళ్ల స్థలాలు సాధించే వరకు పోరాటం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నర్సింహ



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ

హయత్‌నగర్: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నర్సింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి ఆరోపించారు. రావినారాయణరెడ్డి కాలనీలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ... పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని పాపయ్యగూడలో పేదలు గుడిసెలు వేసుకుని నాలుగు నెలలు పూర్తయ్యిందన్నారు. సీపీఐ పార్టీ ఒక్క పిలుపుతో ఒక్క రోజులోనే సుమారు 16వేల మంది గుడిసెలు వేసుకుని ఎలాంటి సౌకర్యాలు లేకున్నా అక్కడ నివాసం ఉంటున్నారంటే ఇంటి స్థలాల కాంక్ష ప్రజల్లో ఎంత ఉందో ప్రభుత్వం అర్థం చేసుకోవాలన్నారు. భూదాన భూమిని ప్రైవేట్ భూమిగా చూపించేందుకు గతంలో రెవెన్యూ అధికారులు ఓఆర్సీ ఇచ్చారని.. విలువైన భూదాన భూములను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా ప్రజలకు దక్కాలనే ఉద్దేశ్యంతో భూపోరాటం చేస్తున్నామని వెల్లడించారు. పాపయ్యగూడలో గుడిసెలు వేసుకున్న పేదలు చుట్టుపక్కల నాలుగు నియోజకవర్గాలకు చెందిన వారేనని.. వారికి ఇక్కడ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కృషిచేయాలని కోరారు. పార్టీ కార్యకర్తలను, గుడిసె వాసులను భయపెట్టి ఇక్కడి నుంచి ఖాళీ చేయించాలని అధికారులు చూస్తున్నారని.. గుడిసెవాసులకు ఇళ్ల స్థలాలు గానీ, సమీపంలో ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ఇస్తే ఖాళీ చేసేందుకు అభ్యంతరం లేదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి యాదిరెడ్డి, స్థానిక కౌన్సిలర్ లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ హరిసింగ్ నాయక్, నాయకులు శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంఘటితంగా ఉద్యమించాలి

రాష్ట్ర పద్మశాలీ సంఘం జిల్లా కన్వీనర్ సుధాకర్



బాలకృష్ణకు సభ్యత్వ నమోదు పుస్తకాలను అందిస్తున్న సుధాకర్

ఆమనగల్లు: హక్కుల సాధనే లక్ష్యంగా పద్మశాలీయులు సంఘటితంగా ఉద్యమించాలని తెలంగాణ పద్మశాలీ సంఘం జిల్లా కన్వీనర్ సుధాకర్ పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ దేవస్థాన ఆవరణలో మంగళవారం మండల పద్మశాలీ సంఘం సమావేశం మండల కన్వీనర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుధాకర్ మాట్లాడుతూ.. పద్మశాలీయులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని అన్నారు. సంఘటితంగా ఉండి హక్కులు సాధించుకుందామని సూచించారు. రాష్ట్ర పద్మశాలీసంఘం ఆదేశాల మేరకు అన్ని మండలాల్లో సంఘం సభ్యత్వాల నమోదు కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. వీలైనంత త్వరగా ఆమనగల్లు మండలంలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తిచేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆమనగల్లు మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, ఉపాధ్యక్షుడు శ్రీను, చేనేత సంఘం అధ్యక్షుడు శ్రీను, నాయకులు శివలింగం, సత్యరాములు, ఆంజనేయులు, రవి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ సుధాకర్.. స్థానిక అధ్యక్షుడు బాలకృష్ణకు సభ్యత్వ నమోదు పుస్తకాలను అందించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఇంకుడుగుంత పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధీ హామీ పనులను అధికారులు మంగళవారం పరిశీలించారు. దండుమైలారం, నెర్రపల్లి, ముకునూర్, నాగన్‌పల్లి గ్రామాల్లోని ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దండుమైలారంలో ఇంకుడుగుంతలు తీయడం, నెర్రపల్లిలో గ్రామీణ క్రీడా ప్రాంగణం నిర్మాణ పనులను పరిశీలించారు. ముకునూర్ గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్, ఉపాధి హామీ అడిషనల్ ప్రోగ్రాం అధికారి తిరుపతిచారి, ఏపీడీ సక్రియానాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు జగన్, మల్లేశ్వరి, భాస్కర్‌గౌడ్, ఎంపీటీసీ అనసూయ, గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే యాచారం మండలం చౌదర్‌పల్లిలో ఇంకుడుగుంతల తవ్వకం పనులను మంగళవారం సర్పంచ్ నర్సింహారెడ్డి ప్రారంభించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత

కాపరికి గాయాలు

కడ్తాల్: మండల పరిధిలోని న్యామతాపూర్ గ్రామ శివారులో విద్యుదాఘాతానికి గురై ఓ పాడి ఆవు మృతి చెందగా బాలుడికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని రావిచేడ్, న్యామతాపూర్ గ్రామాల్లో సోమవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలివానకు పొలంలో విద్యుత్‌తీగ తెగిపడిపోయింది. ఇదిలాఉండగా మంగళవారం ఉదయం రావిచేడ్ గ్రామానికి చెందిన రైతు జంగయ్యకు చెందిన పాడిఆవు మేత మేసుకుంటూ తెగిపోయిన విద్యుత్ తీగకు తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడింది. ఆవుల కాపరిగా ఉన్న బాలుడు గమనించి ఆవును కాపాడే ప్రయత్నం చేయగా బాలుడు కూడా విద్యుదాఘాతానికి గురవ్వడంతో స్వల్ప గాయలైనట్లు స్థానికులు తెలిపారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

జేపీఎస్‌ల పర్మినెంట్ హర్షణీయం



కడ్తాల్: సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జేపీఎస్‌లు, నేతలు



ఇబ్రహీంపట్నం రూరల్: మంత్రి ఎర్రబెల్లికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతలు

ఎంపీపీ కమ్లీమోత్యా నాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించడానికి విధివిధానాలు ఖరారు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీచేయడం పట్ల ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్ నాయక్, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ, జెడ్పీటీసీల ఆధ్వర్యంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. హామీ నిలబెట్టుకున్న సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీఓ మధుసూధనాచారి, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కేబినేట్ తీర్మానం హర్షణీయం..

ఇబ్రహీంపట్నం రూరల్: జేపీఎస్‌లను పర్మినెంట్ చేస్తూ తెలంగాణ క్యాబినెట్ తీర్మానం చేయడం హర్షణీయమని జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి తెలిపారు. మంగళవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రిన్స్‌పాల్ సెక్రటరీ సందీప్ సుల్తానీయాను ఆయన కలిసి జేపీఎస్‌ల విషయమై కేబినేట్ నిర్ణయం పట్ల పధన్యవాదాలు తెలిపారు. అలాగే ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ అలుగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరారు. ఆయన వెంట సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదయ్యగౌడ్, జేపీఎస్‌లు తదితరులు ఉన్నారు.

డిమాండ్లు నెరవేర్చేవరకు పోరాటం

- సీఐటీయూ మండల అధ్యక్షుడు బాల్‌రాజు
- 37వ రోజుకు చేరిన వీఓఏల సమ్మె



నిరసన తెలుపుతున్న వీఓఏలు

కందుకూరు: వీఓఏల న్యాయమైన డిమాండ్‌లు తీర్చే వరకు పోరాటాన్ని ఆపమని సీఐటీయూ మండల అధ్యక్షుడు బుట్టి బాల్‌రాజు అన్నారు. మండల కార్యాలయం ఆవరణలో వీఓఏలు చేపట్టిన సమ్మె మంగళవారంతో 37 రోజులకు చేరింది. ఈ సందర్భంగా బాల్‌రాజు మాట్లాడుతూ.. వీఓఏలు డిమాండ్ల పరిష్కారం కోసం రోడ్లపైకి వచ్చి నెల రోజులకు పైగా అవుతున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం బాధాకరమన్నారు. తమ డిమాండ్లు నెరవేర్చేవరకు పోరాటం ఆపేదిలేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు ఆర్.రజిత, మాధవి, మంగ, పి.రజిత, రాధ, శశికళ, శారద, పావని, రజిని, జయ, సంగీత, మంజుల, పద్మ, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ చేపట్టండి

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: బీఆర్ఎస్ పార్టీ ఎన్నికలప్పుడు రూ.లక్షలోపు పంటరుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు కావస్తున్నా పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. అరకొరగా రూ.25వేల రుణాల వరకే రుణమాఫీ చేసి చేతులు దులుపుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రైతు రుణమాఫీ పూర్తిచేయాలని కోరారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సర్పంచ్ పాండునాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు ఉన్నారు.

'ఉపాధి' పనుల్లో సమస్యలుంటే తెలపండి

ఇబ్రహీంపట్నం: ఉపాధీ హామీ పనుల్లో ఎలాంటి సమస్యలున్నా తమను సంప్రదించాలని ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి కూలీల వేతనాలు, చెల్లింపులు తదితర సమస్యలతోపాటు కొత్తగా జాబ్‌కార్డు కావాలనుకునే కూలీలు, వ్యవసాయ పొలాల్లో ఉపాధి పనులు కావాలనుకునే రైతులు 92814 87190, 92814 87091 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కల్యాణలక్ష్మితో పేదల ఇంట్లో వెలుగులు

మీర్‌పేట మేయర్ దుర్గ



మీర్‌పేట: లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మేయర్ దుర్గ, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి

మీర్‌పేట: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంతో పేదల ఇంట్లో వెలుగులు విరజిమ్ముతున్నాయని మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ అన్నారు. మంగళవారం ఆయన కార్పొరేషన్ పరిధిలో 53 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, తహసీల్దార్ జనార్దన్‌రావు, కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్, ఫ్లోర్‌లీడర్లు అర్కల భూపాల్‌రెడ్డి, కీసర గోవర్ధన్ రెడ్డి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు పల్లె ఎం.ఎ.. రజాక్, జంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి..

బడంగ్‌పేట్: మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. అర్హులంతా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జగన్నాథరావు, కార్పొరేటర్లు ప్రభాకర్‌రెడ్డి, భారతమ్మ, స్వప్న, సుదర్శన్‌రెడ్డి, లలిత, రోహిణి, పి.శ్రీనివాస్‌రెడ్డి, అర్జున్, పవన్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించండి



అల్మాస్‌గూడలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ పారిజాత

మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్‌గృహకల్పలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను మంగళవారం మేయర్ చిగురింత పారిజాత, డీఈఈ అశోక్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. త్వరగా పూర్తిచేయాలన్నారు. ఈ పరిశీలనలో ఆమె వెంట మాజీ సర్పంచ్ ముత్యాల కృష్ణ, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి: కార్పొరేటర్



కమిషనర్ పంకజకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి మంగళవారం ఎల్‌బీనగర్ ఈస్ట్ జోనల్ కమిషనర్ పంకజ, డిప్యూటీ కమిషనర్ హరికృష్ణయ్యలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ.. డివిజన్‌లో మంజూరైన యూజీడీ పైపులైన్ పనులను తక్షణమే పూర్తి చేయాలని, విజయపురికాలనీ, జేబీకాలనీ, ఇండోర్ స్టేడియం వద్ద నాలా పనులు, లక్ష్మీనగర్, ఎస్‌బీఐకాలనీ, వేంకటేశ్వరకాలనీ, క్రాంతినగర్, శంకర్‌నగర్, అంబేడ్కర్‌నగర్‌లలో కొత్త రోడ్లు, వర్షపునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవడంతో పాటు కొత్తపేట చౌరస్తా, అన్నపూర్ణ క్యాంటీన్ ఏర్పాటు, వీధికుక్కల నిర్మూలన చేపట్టాలని కోరారు. దీంతో పాటు మంజూరైన మహిళా భవన్‌లు, కమ్యూనిటీ హాళ్ల పనులను తక్షణమే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట బీజేపీ నేతలున్నారు.